సాక్షి
మహబూబాబాద్
గురువారం । 6 । జూన్ । 2024



కొనసాగుతున్న 'ఎమ్మెల్సీ' కౌంటింగ్

నేటి ఉదయం తేలనున్న మొదటి ప్రాధాన్యత ఓట్ల ఫలితం

వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ బుధవారం నల్లగొండలో ప్రారంభమైంది. 96 టేబుళ్లపై 25 ఓట్లను ఒక్క బండిల్‌గా కట్టారు. ఈ ప్రక్రియ 4 గంటల వరకు సాగింది. ఆ తర్వాత మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. - 8లో▸ -నల్లగొండ

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



బయ్యారం: నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) అభిమన్యుడు హెచ్చరించారు. బుధవారం బయ్యారంలోని పలు విత్తన దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన దుకాణాల్లో డీలర్లు విధిగా స్టాక్ బోర్డు, ఇన్వాయిస్ బిల్లులు, క్యాష్‌బిల్, రిజిస్టర్లు మెయింటెన్ చేయాలని సూచించారు. అలాగే మన గ్రోమోర్ సెంటర్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. డీలర్లు రైతులకు కచ్చితంగా రశీదులు ఇవ్వాలని, రశీదుపై విత్తన కంపెనీ పేరు విధిగా రాయాలని సూచించారు. రశీదులను రైతులు పంట పూర్తయ్యేంత వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో తిరుగుతూ దళారులు అమ్ముతున్న విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని సూచించారు. విత్తన డీలర్లు సీడ్ యాక్ట్ ప్రకారం లోబడి నిబంధనలు పాటించాలన్నారు. లేనియెడల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ బానోత్ రాంజీ, ఏఈఓ సురేష్ తదితరలుఉ పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ



మహబూబాబాద్ రూరల్: కబడ్డీ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా మద్ది వెంకట్ రెడ్డి, కార్యదర్శిగా సంద వీరన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కె.జగదీశ్వర్ యాదవ్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం గ్రామంలో బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ముఖ్య సలహాదారులుగా వల్లూరి కృష్ణారెడ్డి, ఇస్లావత్ లచ్చిరాంనాయక్, అధ్యక్షుడిగా మద్ది వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంద వీరన్న, ఉపాధ్యక్షులుగా తోట యాకాంబ్రం, గంధసిరి శ్రీనివాస్, గుంటక కుమారస్వామి, బాదే శ్రీను, సహాయ కార్యదర్శులుగా చాంప్లా నాయక్, గుమ్మళ్ల సురేందర్, బీసు యాకన్న, రాసమల్ల అనిల్, కోశాధికారిగా ఈసం స్వామి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గుగులోత్ శ్రీనివాస్, ఇమాం, బొడ్డు రాములు, నూకల అన్వేష్, మడతపల్లి శ్రీను, పెసర అఖిల్, పేరాల చరణ్, గౌని యాదగిరి, కొడవండ్ల యాదగిరిని ఎన్నుకున్నారు.

గ్రూప్-1 పకడ్బందీగా నిర్వహించాలి



మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఏఎస్పీ చెన్నయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలెటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 12 సెంటర్లకు సంబంధించి 34మంది అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణ బాధ్యతలను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఈ నెల 9న ఉదయం 10:30గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులు ఉదయం 8గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 4,412 మంది పరీక్షలు రాస్తారని, నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించొద్దన్నారు. గ్రూప్-1 పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సీఐ సత్యనారాయణ, ఎస్సై దిలీప్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు పెరగాలి

బయ్యారం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష ఆదేశించారు. బుధవారం మండలంలోని గంధంపల్లి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులు, వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. గ్రామాల్లో గర్భిణులను 12వారాల్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. 0 నుంచి 5సంవత్సరాలలోపు పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయాలన్నారు. సీహెచ్‌ఓ కృష్ణార్జున్ రావు, శ్రీనివాస్, రమ, సునీత పాల్గొన్నారు.

భారీ వ్యత్యాసం..

బీఆర్‌ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల కన్నా 1,81,494 ఓట్లు తగ్గుదల

- మానుకోట పార్లమెంట్ ఎన్నికల్లో అంచనాలు తలకిందులు
- మెజార్టీ వస్తుందనుకున్న నియోజకవర్గాల్లోనూ నిరాశ
- అంతర్మథనంలో పార్టీ శ్రేణులు



సాక్షి, మహబూబాబాద్: ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి పడిన ఓట్లతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా తేడా వచ్చింది. ఇంతలోనే అంత తేడా ఎందుకు వచ్చింది.. అసలేం జరిగిందని బీఆర్‌ఎస్ నాయకులు ఆలోచనలో పడ్డారు. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఉద్యమించాం.. పది సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధి చేశాం.. అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు కోరుకున్నారు అనుకుందా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఏమైంది.. ఐదు నెలల్లోనే ఇంత మార్పు ఎందుకు వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల కన్నా ఇప్పుడు ఓట్లు ఎందుకు తక్కువ వచ్చాయి' అని బీఆర్‌ఎస్ నాయకులు అంతర్మథనంలో పడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మానుకోట పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి 12లక్షల పైచిలుకు ఓట్లు పోలయ్యాయి. ఇందులో 6,85,897ఓట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు రాగా.. 4,43,910 ఓట్లు బీఆర్‌ఎస్‌కువచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 2,53,425 ఓట్లు అధికంగా పోలయ్యాయి. కాగా పార్లమెంట్ ఎన్నికల్లో 11,00,480 ఓట్లు మాత్రమే పోల్‌కాగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌కు 6,08,485 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు 2,62,416 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే అసెంబ్లీ ఎన్నికల కన్నా.. 1,81,494ఓట్లు బీఆర్‌ఎస్ పార్టీకి తక్కువగా వచ్చాయి.

అంచనాలు తలకిందులు...

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు భారీగా పడిపోయింది. ఏడు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు తమ గెలుపుకోసం విస్తృత ప్రచారం చేశారు. అయితే పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని మాత్రం పట్టించుకోలేదనే విమర్శలు వచ్చాయి. ఇదిలా ఉండగా ప్రభుత్వం మారడంతో ఓటర్లలో కూడా మార్పు వచ్చే బీఆర్‌ఎస్‌ను ఆదరించలేదనే వాదన పార్టీ శ్రేణుల్లో ఉంది. మానుకోటలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి ఎన్నడు లేనివిధంగా జనాలు భారీగా తరలివచ్చారు. దీంతో అభ్యర్థి మాలోత్ కవితతో పాటు ముఖ్య నాయకులు, శ్రేణుల్లో జోష్ నిండుకుంది. ఇదే ఊపులో మానుకోట అసెంబ్లీ నియోజకవర్గంలో మంచి మెజార్టీ వస్తుందని అందరూ భావించారు. అలాగే తన కూతురు కవిత గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ డోర్నకల్ నియోజకవర్గంలో తిరగని తండా.. వెళ్లని గ్రామం లేదు. దీంతో ఆ నియోజకవర్గంలో కూడా గతం కన్నా ఎక్కువ ఓట్లు వస్తాయని భావించారు. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచిన భద్రాచలం, కవిత అత్తగారు, బంధువులు ఎక్కువగా ఉండే ఇల్లెందు నియోజకవర్గంలో కూడా మెజార్టీ ఓట్లు వస్తాయని బీఆర్‌ఎస్ నాయకులు లెక్కలు వేసుకున్నారు. కానీ అందరి అంచనాలు తలకిందులయ్యాయి. కాగా ఓటమికి కారణాలపై పోస్టుమార్టం చేస్తున్నారు. కార్యకర్తల్లో నమ్మకం లేకుండా పోయిందా.. పార్టీ ఫిరాయింపులు ఎక్కువయ్యాయా.. ఇతర అంశాలపై లోతుగా విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది. కాగా, పార్టీనే నమ్ముకొని ఉన్నవారి పరిస్థితి ఏమిటనేది చర్చగా నాయకుల్లో మారింది. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా నాయకులు పార్టీని బలోపేతం చేసి కార్యకర్తలకు భరోసా ఇస్తారా.. లేదా అనేది పార్టీలో ప్రశ్నగా మారింది.

2019 మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	తేడా
డోర్నకల్	78,986	53,639	25,347
మహబూబాబాద్	84,031	55,785	28,246
నర్సంపేట	84,858	59,058	25,800
ములుగు	71,518	40,735	30,783
పినపాక	55,958	30,484	25,474
ఇల్లెందు	53,891	53,742	149
భద్రాచలం	32,582	21,819	10,763
మొత్తం	4,61,824	3,15,262	1,47,562

2023 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధి నియోకవర్గాల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్‌పార్టీకి వచ్చిన ఓట్లు	అభ్యర్థి మెజార్టీ
మహబూబాబాద్	1,15,587	50,171
డోర్నకల్	1,16,644	53,131
నర్సంపేట	1,04,185	18,889
ములుగు	1,02,267	33,700
పినపాక	90,510	34,506
ఇల్లెందు	1,09,171	57,309
భద్రాచలం	47,533	5,719(బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిక)
మొత్తం	6,85,897	(2,53,425 కాంగ్రెస్ మెజార్టీ)

2024 మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	కాంగ్రెస్ మెజార్టీ
మహబూబాబాద్	1,02,011	52,128	49,883
డోర్నకల్	95,306	50,293	45,013
నర్సంపేట	1,00,319	45,228	55,091
ములుగు	86,825	33,592	53,233
పినపాక	77,430	28,111	49,319
ఇల్లెందు	92,957	33,658	59,299
భద్రాచలం	53,637	19,406	34,231
మొత్తం	6,08,485	2,62,416	3,46,069

ప్రతిష్ఠాత్మకంగా ప్రచారం చేసినా..?

అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్‌ఎస్ నాయకులు శ్రమించారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఉనికిని కాపాడుకొని, కార్యకర్తల్లో ధైర్యం నింపాలనే ఆలోచనతో ప్రచారం చేశారు. ఇందులో భాగంగా పార్టీ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించే బాధ్యతను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన భుజాలమీద వేసుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుతో పాటు ఇల్లెందు, మహబూబాబాద్, నర్సంపేట, పినపాక మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, రేగ కాంతారావు, ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి విస్తృత ప్రచారం చేశారు. ఎవరి నియోజకవర్గంలో వారు కష్టపడాలని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. అదేస్థాయిలో అందరు కష్టపడినట్లు కనిపించింది. కానీ తీరా ఓట్ల లెక్కింపు చూస్తే అన్ని చోట్ల ఆశించిన స్థాయి కాదు.. కనీస స్థాయిలో కూడా ఓట్లు పడలేదు.

ఎక్కడ అనుకూలం.. ఎందుకు ప్రతికూలం

- ఓటమిపై బీజేపీ, బీఆర్‌ఎస్‌ల పోస్టుమార్టం
- సత్తా చాటని అత్యధిక స్వతంత్ర అభ్యర్థులు
- రెండు స్థానాల్లోనూ ఇండిపెండెంట్ల ప్రభావం అంతంతే
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, బీఎస్పీ, ఏడీఆర్‌పీల తర్వాత 'నోటా'కే ఓట్లు..

- సాక్షిప్రతినిధి, వరంగల్

- వివరాలు 8లో▸

మెరుగైన వైద్య సేవలందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

నెహ్రూసెంటర్: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎన్‌సీడీ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు. పాలియేటివ్‌కేర్ యూనిట్‌ను సందర్శించి పెద్ద వయసు వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి మరింత మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈ మహేందర్‌రెడ్డి, గీత, ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియా కూటమిదే నైతిక విజయం



సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథిరెడ్డి

నెహ్రూసెంటర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిదే నైతిక విజయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాయంలో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో 400 సీట్లు వస్తాయని గొప్పలు చెప్పిన మోదీ, బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ దాటలేదని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్‌లో ఇండియా కూటమి అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు కోసం సీపీఐ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి విస్తృతంగా ప్రచారం చేశామన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ తమ ఓట్లను బీజేపీకి మళ్లించిందని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ శకం ముగిసిందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందంలో భాగమే బీజేపీకి 8పార్లమెంట్ సీట్లు వచ్చాయన్నారు. ఇండియా కూటమి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసిన పార్టీ నాయకులు, శ్రేణులు, ఓట్లు వేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, నర్ర శ్రావణ్, వెలుగు శ్రావణ్, మాలోత్ రవీందర్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'బడి బాట'

- 19వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్
- పిల్లల చేరికపై ప్రత్యేక దృష్టి
- 12న పాఠశాలల పునఃప్రారంభం



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, పిల్లలు(ఫైల్)

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో బడీఈడు పిల్లలను చేర్పించేందుకు నేటి నుంచి బడి బాట కార్యక్రమం చేపట్టనున్నారు. ఈమేరకు జిల్లాలో చదువుకు దూరమైన పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచడంపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు చిన్నరుల తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతను తెలియజేయనున్నారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి చదువుకు దూరమైన పిల్లలను పాఠశాలలకు తీసుకురావటమే లక్ష్యంగా బడిబాట కార్యక్రమాన్ని తలపెట్టారు. కాగా ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

పాఠశాలల్లో కార్యక్రమాలు

ప్రతీరోజు ఉదయం 7నుంచి 11గంటల వరకు అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది. పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరేలా ఉపాధ్యాయులు ర్యాలీలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలతో పాటు డోర్ టు డోర్ ప్రచారం చేపడుతారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాల పంపిణీ, స్కూల్ యూనిఫాంల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి అడ్మిషన్లు చేపట్టాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హత కలిగిన చిన్నారులు ఒకటో తరగతిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలి.


ఆచరణలో కనిపించని వైనం..

ఏటా నూతన విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యాశాఖ పలు కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ బడిబయట ఉన్న పిల్లల సంఖ్య పెరుగుతూనే ఉంది. జిల్లాలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, హోటళ్లు, మెకానిక్ షాపులు, పండ్ల బండ్లు, నిర్మాణ రంగ పనులు తదితర ప్రాంతాల్లో పిల్లలు కనిపిస్తున్నారు. కాగా బడి బాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యాబోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి వివరించాల్సి ఉన్నప్పటికీ.. తూతూ మంత్రంగానే చేపడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కార్యక్రమాలు ఇలా..

- అర్హత ఉన్న అంగన్‌వాడీ సెంటర్ పిల్లలను సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పించాలి.
- బడి బయట పిల్లలను గుర్తించాలి.అలాగే డ్రాపౌట్స్, బడికి వెళ్లని, చాలాకాలంగా స్కూల్‌కు హాజరుకాని వారిని గుర్తించి బడిలో చేర్పించాలి.
- ఇందుకు స్వయం సహాయక సంఘాల సహాయం పొందాలి.
- బాల కార్మికులను గుర్తించి వారిని సంబంధిత బడిలో చేర్పించాలి.
- జూన్ 9లోపు ఆన్‌లైన్ ప్రమోషన్ చేయాలి.
- జూన్ 12 నుంచి 19వరకు పాఠశాలల పున: ప్రారంభ కార్యక్రమాలు చేపట్టాలి.
- తల్లిదండ్రులకు స్వాగతం పలకాలి.
- ప్రజాప్రతినిధులు సంప్రదాయపద్ధతుల్లో బడబాట నిర్వహించాలి.

బడిబటాలో ఉపాధ్యాయులు పాల్గొనాలి



మానుకోట జిల్లాలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో పాల్గొనాలి. అత్యధికంగా విద్యార్థులను చేర్పించడంలో శ్రద్ధ వహించి, ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు కృషి చేయాలి.

- పి.రామారావు, డీఈఓ

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 2024-25 సంవత్సరానికి ఒకటి, ఐదో తరగతుల్లో ప్రవేశాలకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఆర్. బాలరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతిలో 47 సీట్లు, ఐదో తరగతిలో 97 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం ఉండదన్నారు. ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందేవారు 01-9-2018 నుంచి 31-8-2019 మధ్య జన్మించి ఉండాలని, ఐదో తరగతిలో ప్రవేశాలకు 01-9-2014 నుంచి 31-8-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. కుల, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు ఉండాల న్నారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా షెడ్యూల్ కులాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

- డీఎఫ్‌ఓ విశాల్ బత్తుల

మహబూబాబాద్ రూరల్: మొక్కలునాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌ఓ) విశాల్ బత్తుల అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అటవీ శాఖ సిబ్బంది స్థానిక మదర్ థెరిసా సెంటర్ నుంచి జమాండ్లపల్లి గ్రామ శివారులోని అటవీశాఖ అర్బన్ పార్క్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానుకోట నందనవనం (అటవీశాఖ అర్బన్ పార్క్) ఆవరణలో డీఎఫ్‌ఓ మొక్కలునాటి మాట్లాడారు. మొక్కలు నాటి ప్రకృతిని ప్రేమించాలని, పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డివిజనల్ అధికారి పోలోజు కృష్ణమాచారి, ఫారెస్ట్ రేంజ్ అధికారులు జ్యోత్స్న, రామ్మూర్తి, రేణుక, డిప్యూటీ రేంజ్ అధికారులు సాంబు, రీనా, సెక్షన్ అధికారులు కిషన్ రావు, నవీన్, రాములు, బీట్ అధికారులు రవీందర్, లక్ష్మణ్, హరిసింగ్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటిన డీఎఫ్‌ఓ విశాల్, అధికారులు, సిబ్బంది

మహబూబాబాద్ రూరల్: మొక్కలునాటి ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. మానవులు తమ మనుగడకోసం స్వార్థంతో ప్రకృతి ప్రసాదించిన అడవులను నరికి వ్యవసాయం చేయడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఏటా ఒక మొక్కను నాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, బార్ సోసియేషన్ అధ్యక్షుడు కీసర పద్మాకర్ రెడ్డి, వెంకటస్వామి, మున్సి పల్ కమిషనర్ నోముల రవీందర్, ప్రభుత్వ న్యా యవాది కొంపెల్లి వెంకటయ్య, జిల్లాకోర్టు పరిపాలనాధికారి క్రాంతికుమార్, సూపరింటెండెంట్ అమరేందర్, అనిల్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించాలి: డీపీఓ హరిప్రసాద్

కురవి: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) హరిప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కురవి జీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ యాకాంబ్రం, పంచాయతీ కార్యదర్శి దివాకర్ పాల్గొన్నారు.

టీఎస్ఐసెట్ మొదటి రోజు ప్రశాంతం



హనుమకొండలోని ఓ కేంద్రం వద్ద విద్యార్థులు

కేయూ క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీఎస్ ఐసెట్ ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్డ్)లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగింది. వరంగల్ రీజియన్‌లో హనుమకొండ, వరంగల్, నర్సంపేటలోని 8 పరీక్ష కేంద్రాల్లో ఈప్రవేశపరీక్ష నిర్వహించారు. మొదటి సెషన్ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించగా.. మొత్తం 1,554 మంది విద్యార్థులకు 1,446 మంది హాజరైనట్లు టీఎస్ ఐసెట్ కన్వీనర్ ఆచార్య ఎస్.నర్సింహాచారి తెలిపారు. కాగా.. మొదట కాకతీయ యూనివర్సిటీలోని టీఎస్ ఐసెట్ కార్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి ప్రశ్నపత్రం సెట్‌ను ఎంపిక చేశారు. ఆయన వెంట రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రటరీ శ్రీరాం వెంకటేశ్ ఉన్నారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

వరంగల్‌లోని ఓ పరీక్ష కేంద్రాన్ని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి పరిశీలించారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, టీఎస్ ఐసెట్ కన్వీనర్ ఆచార్య నర్సింహాచారి వివిధ పరీక్ష కేంద్రాల్ని పరిశీలించారు. స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. గురువారం ఒక సెషన్‌తో టీఎస్ ఐసెట్ పరీక్ష ముగియనుంది.

యేసు కుటుంబానికి న్యాయం చేయాలి



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

వాజేడు: మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి మృతి చెందిన ఇల్లెందుల యేసు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ.. సుమారు 3 వేల మంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. జగన్నాథపురం జంక్షన్‌ నుంచి జగన్నాథపురం గ్రామం వరకు జాతీయ రహదారిపై ఈ ర్యాలీ కొనసాగింది. జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల యేసు(55) కొంగాల గ్రామ సమీపంలోని గుట్టపై సోమవారం వంట చెరుకు తేవడానికి వెళ్లిన సమయంలో మందు పాతర పేలడంతో మృతి చెందిన విషయం తెలిసిందే.. మావోయిస్టులు అమర్చిన మందు పాతర మూలంగానే యేసు మృతి చెందాడని ఆరోపిస్తూ ఫ్లెక్సీలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మందుపాతర మూలంగా అమాయకుడు బలి అయ్యాడని అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు.

గెలుపోటములు సహజమే..

- ప్రశ్నించే గొంతుకగా సమస్యలపై ఉద్యమిస్తాం
- ప్రజాతీర్పును స్వాగతిస్తున్నాం
- బీఆర్‌ఎస్‌ మానుకోట జిల్లా అధ్యక్షురాలు కవిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాలోత్‌ కవిత


మహబూబాబాద్‌: రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమి చెందినా ప్రజలకు సేవ చేస్తూ అందుబాటులో ఉంటానని బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్‌ కవిత అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కవిత మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ప్రశ్నించే గొంతుకై ప్రజల తరఫున ఉద్యమిస్తామన్నారు. ఎంపీగా.. పార్లమెంట్‌ సమావేశాల్లో బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ వంటి అనేక అంశాలపై ప్రస్తావించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ మాట్లాడుతూ.. పార్లమెంట్‌ ఎన్నికల ఫలితాలు భిన్నంగా వచ్చాయన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీకి ఓటు వేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఫలితాలపై సమీక్షలు నిర్వహించుకుని ముందుకెళ్తామన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రజల తరఫున పోరాడతామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్‌ ఆంగోత్‌ బిందు, మాజీ ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌నాయక్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ వెంకన్న, నాయకులు భరత్‌ కుమార్‌ రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌ రెడ్డి, కన్నా, ముత్యం వెంకన్న, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్‌ జిల్లాకే కాకుండా ఉత్తర తెలంగాణ జిల్లాలు ఖమ్మం, కరీంనగర్‌, ఆదిలాబాద్‌ ప్రజలకు కూడా పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన అనంతరం విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని కేఎంసీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మోహన్‌దాస్‌ తెలిపారు. కేఎంసీకి అనుబంధంగా ఉన్న ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్‌, టీబీ ఆస్పత్రులతో పాటు కళాశాలలో జరిగిన అభివృద్ధి గురించి 'సాక్షి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- ఎంజీఎం

పదేళ్లలో 500 ఎంబీబీఎస్‌ సీట్ల పెరుగుదల

- ఐదు నూతన మెడికల్‌ కళాశాలలు
- అందుబాటులోకి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి
- కేఎంసీ ప్రిన్సిపాల్‌ మోహన్‌దాస్‌



డాక్టర్‌ మోహన్‌ దాస్‌

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు





ఉమ్మడి జిల్లాలో ఐదు నూతన మెడికల్‌ కళాశాలలు

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ. 1100 కోట్లతో చేపట్టిన ఆస్పత్రి పనులు చివరి దశకు చేరుకున్నాయి. పదేళ్ల కాలంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఐదు నూతన మెడికల్‌ కళాశాలలు అందుబాటులోకి రాగా వాటి ద్వారా ఏకంగా 500 నూతన ఎంబీబీఎస్‌ సీట్లు పెరగడంతో పాటు 107 ఉన్న పోస్టు గ్రాడ్యుయేట్‌ సీట్లు 197కు పెరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏ మెడికల్‌ కళాశాలకు మంజూరు కాని ఐదు ఎమర్జెన్సీ మెడిసిన్‌ పీజీ సీట్లు కేఎంసీకి మాత్రమే మంజూరయ్యాయి. మొదటిసారి నెఫ్రాలజీ సూపర్‌స్పెషాలిటీ విభాగంలో ఐదు సూపర్‌ స్పెషాలిటీ సీట్లు సైతం దక్కాయి. అంతేకాకుండా రూ.150 కోట్ల పీఎంఎస్‌ఎస్‌వై నిధుల ద్వారా అత్యాధునిక 250 పడకలు సూపర్‌స్పెషాలిటీ విభాగంలో అందుబాటులోకి వచ్చాయి. మొత్తానికి పదేళ్లలో కాలంలో వైద్యరంగంలో టీచింగ్‌ ఆస్పత్రుల్లో పెను మార్పులు సంభవించాయి. ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నెల రోజుల్లో నోటిఫికేషన్‌ ఇవ్వనుంది.

డిసెంబర్‌ కల్లా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి..

రూ. 1100 కోట్ల వ్యయంతో చేపట్టి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి 24 అంతస్తుల నిర్మాణం పూర్తి జరిగింది. 9 అంతస్తుల్లో అంతర్గత పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా పరికరాల మరమ్మతులతో సహా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఎల్‌అండ్‌టీ కంపెనీ ఆదేశించగా.. డిసెంబర్‌ కల్లా అందిస్తామని హామీ ఇచ్చింది.

మెరుగైన కార్డియాలజీ సేవలు..

సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా కార్డియాలజీ సేవలు మెరుగుపడ్డాయి. క్యాథ్‌లాబ్‌ అందుబాటులోకి రావడం ద్వారా ప్రతి నెల 300 యాంజీయోగ్రాములు, 50 స్టంట్‌లను విజయవంతంగా నిర్వహిస్తూ పేద రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం. అలాగే, యురాలజీ, నెఫ్రాలజీ, పీడీయాట్రిక్‌ సర్జన్‌ విభాగాల్లో సైతం మెరుగైన సేవలందిస్తాం. అంతే కాకుండా అర్థోపెడిక్‌ విభాగంలో పెద్దఎత్తున మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేశాం.

కళాశాలకు నూతన భవనాలు, ఎక్సలెన్స్‌ కేంద్రాలు..

కాకతీయ మెడికల్‌ కళాశాలలో 200 సీట్ల ఉండగా 50 సీట్లు అదనంగా మంజూరు కావడంతో ఎంబీబీఎస్‌ సీట్ల సంఖ్య 250కు చేరుకుంది. పెరిగిన ఎంబీబీఎస్‌ సీట్లకు అనుగుణంగా నాలుగు నూతన హాస్టళ్ల నిర్మాణంతో పాటు కళాశాలకు రీజినల్‌ ఎమర్జెన్సీ ట్రైనింగ్‌ కేంద్రం, స్కిల్‌ సెంటర్లు మంజూరయ్యాయి. అలాగే, రూ. 18 కోట్లతో అత్యాధునిక అకడమిక్‌ బ్లాక్‌ అందుబాటులోకి వచ్చింది.

సీకేఎం, జీఎంహెచ్‌ ఆస్పత్రుల్లో నూతన భవనాలు, పెరిగిన ప్రసవాలు..

ప్రసూతి సేవలుకు పెద్ద దిక్కుగా ఉన్న హనుమకొండ జీఎంహెచ్‌, వరంగల్‌ సీకేఎం ఆస్పత్రుల్లో నూతన భవనాలు నిర్మించి సేవలు మెరుగుపరిచాం. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఆయా ఆస్పత్రులకు వచ్చే గర్భిణుల సంఖ్య భారీగా పెరిగింది. ఆ మేరకు సేవలు అందిస్తున్నాం.

24 అంతస్తుల్లో 2032 పడకలు..

రూ. 1100 కోట్లతో సెంట్రల్‌ జైలు ప్రాంగణంలో 24 అంతస్తుల్లో సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కొనసాగుతోంది. ఈ ఆస్పత్రిలో 21 విభాగాల్లో 2032 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఆస్పత్రి అందుబాటులోకి వచ్చే క్రమంలో ప్రస్తుతం ఉన్న వైద్యులతో పాటు కొత్త వైద్యులను కూడా నియమించి అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్‌ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం.

ఎంజీఎంను ఎంసీహెచ్‌గా మారుస్తారు..

ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిని మదర్‌ అండ్‌చైల్డ్‌ హెల్త్‌ కేర్‌ సెంటర్‌(ఎంసీహెచ్‌) గా మారుస్తాం. పిల్లల విభాగంతో పాటు రిస్కీ మెటర్నటీ సేవలు ప్రస్తుత ఎంజీఎంలో అందిస్తాం. శిథిలావస్థకు చేరుకున్న భవనాలు తొలగించి పేద రోగులకు ధర్మశాలలు ఏర్పాటు చేయడంతో పాటు మార్చురీ సేవలు విస్తృతం చేస్తాం.

ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా టీ-హబ్‌ సేవలు..

వైద్యరంగంలో మెరుగైన సేవలందించే క్రమంలో ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన టీ-హబ్‌ ద్వారా విస్తృత సేవలందుతున్నాయి. హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రి కేంద్రంలో, వరంగల్‌ జిల్లాలో నర్సంపేటలో, జనగామ జిల్లాలో జిల్లా కేంద్రంలో, భూపాలపల్లిలో జిల్లా కేంద్రంలో, ములుగు జిల్లా కేంద్రంలో టీ-హబ్‌ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు చేస్తారు.

ప్రతి జిల్లా కేంద్రంలో పెరిగిన ఆస్పత్రుల పడకలు..

పదేళ్ల కాలంలో ప్రతి జిల్లా కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి నెలకొల్పడం ద్వారా ఆయా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పరంగా వైద్యసేవలందుతున్నాయి. జనగామ జిల్లా కేంద్రంలో మెడికల్‌ కళాశాలకు అనుబంధంగా 250 పడకల ఆస్పత్రి, భూపాలపల్లి జిల్లాలో 100 పడకల ఆస్పత్రి, నర్సంపేటలో 200 పడకల ఆస్పత్రి, ములుగులో ఏరియా ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్‌ చేస్తూ పెద్ద ఎత్తున పడకల సంఖ్య పెంచడంతో ప్రభుత్వ పరంగా వైద్యసేవలు మెరుగుపడ్డాయి. అలాగే, అర్బన్‌ ప్రాంతాల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాలు పెరిగాయి.

అంతర్మథనం



ఓటమిపై బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీల పోస్టుమార్టం

- ఎక్కడ అనుకూలం.. ఎందుకు ప్రతికూలమనే అంశాలపై విశ్లేషణ
- రెండు స్థానాల్లోనూ ఇండిపెండెంట్ల ప్రభావం అంతంతే..
- మహబూబాబాద్‌లో 'నోటా'ను మించిన స్వతంత్రుడు ఒక్కరే..
- పదివేల ఓట్ల మార్క్‌కు చేరిన బీఎస్పీ, ఇతర పార్టీలు

సాక్షిప్రతినిధి, వరంగల్‌: లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో విజేతలు సంబురాలు చేసుకుంటుండగా.. అపజయం పొందిన అభ్యర్థులు పార్టీల నేతలతో ఓటమికి కారణాలను విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో వరంగల్‌ (ఎస్సీ), మహబూబాబాద్‌ (ఎస్టీ) లోక్‌సభ స్థానాలు 2019లో బీఆర్‌ఎస్‌ కైవసం చేసుకుంది. కానీ, 2024ఎన్నికల్లో ఫలితాలు తారుమారయ్యాయి. రెండు స్థానాలను కాంగ్రెస్‌ పార్టీ గెలుచుకుంది. దీంతో బీఆర్‌ఎస్‌, బీజేపీలు అంతర్మథనంలో పడ్డాయి. ఆయాపార్టీల అగ్ర నాయకత్వం ముఖ్యనేతలు, ఇన్‌చార్జ్‌లతో వేర్వేరుగా ఓటమిపై పోస్టుమార్టం నిర్వహిస్తున్నాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి లోపాలను సవరించుకుని.. ఆ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎత్తుగడలు వేయడంపై అభిప్రాయ సేకరణ చేస్తున్నాయి.

ఓటమిపై సమీక్షలు

వరంగల్‌లో కడియం కావ్య 5,81,294(పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లతో కలిపి)ఓట్లు సాధించి సమీప ప్రత్యర్థి, భాజపా అభ్యర్థి అరూరి రమేశ్‌పై 2,20,339 ఆధిక్యంతో గెలుపొందారు. మహబూబాబాద్‌లో మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్‌ 6,12,774ఓట్లు సాధించి సమీప ప్రత్యర్థి, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మాలోతు కవితపై 3,49,165ఓట్ల భారీ మెజార్టీ సాధించారు. 2019లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పసునూరి దయాకర్‌కు వరంగల్‌లో 6.12లక్షలకు పైగా ఓట్లు, 3.5లక్షలకుపైగా మెజార్టీ రాగా అప్పటితో పోలిస్తే తాజా ఫలితాల్లో 3.80లక్షల ఓట్లను ఆపార్టీ కోల్పోయింది. కేవలం 2,32,033ఓట్లకు పరిమితమైంది. మహబూబాబాద్‌లో 2019లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మాలోతు కవితకి 4,62,109ఓట్లు, 1,46,663ఓట్ల మెజార్టీ రాగా.. ఈ ఎన్నికల్లో సిట్టింగ్‌ ఎంపీగా పోటీలో ఉన్నా ఆమెకు 2,63,609ఓట్లు మాత్రమే వచ్చాయి. కాగా, వరంగల్‌ బీజేపీ అభ్యర్థి చింత సాంబమూర్తికి 2019లో 83,777 ఓట్లే రాగా, ఈసారి ఆరూరి రమేశ్‌కు 3,60,955 ఓట్లు వచ్చాయి. ఓటు శాతం బీజేపీకి బాగా పెరిగింది. మహబూబాబాద్‌లో 2019లో 25,447ఓట్లు రాగా, తాజా ఎన్నికల్లో 1,10,444లకు పెరిగాయి. ఈ గణాంకాలు ఆధారంగా బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీలు ఓటమి కారణాలపై లోతుగా సమీక్షలు చేసుకుంటున్నాయి.

'నోటా'ను దాటిన ఇండిపెండెంట్‌ ఒక్కరే..

వరంగల్‌, మహబూబాబాద్‌ లోక్‌సభ నియోజకవర్గం బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులు అంతగా ప్రభావం చూపలేకపోయారు. వరంగల్‌ నుంచి మొత్తం 42మంది బరిలో ఉండగా 31మంది స్వతంత్రులు పోటీలో ఉన్నారు. మహబూబాబాద్‌ లోక్‌సభ పరిధిలో మొత్తం 23మంది అభ్యర్థులు ఉండగా, 11మంది స్వతంత్రులుగా బరిలో నిలిచారు. వరంగల్‌ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌లతో పాటు బీఎస్పీ, ఏడీఆర్‌పీ, ఏఎస్‌పీ, డీఎస్‌పీ, ఎంటీఆర్‌ఎస్‌పీ, ఆర్‌బీఐ, ఆర్‌పీసీ, జీఎంబీ పార్టీల నుంచి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీల అభ్యర్థులు పోను.. అంబోజు బుద్దయ్య(ఏడీఆర్‌పీ)కు 11,115, కల్పన పంజా (బీఎస్పీ)కి 9,327 ఓట్లు రాగా.. మిగతా 37 మందికి 'నోటా' కంటే తక్కువే వచ్చాయి. వరంగల్‌లో 'నోటా'కు 8,380 ఓట్లు వచ్చాయి. వివిధ పార్టీల నుంచి చేసిన ఆరుగురికి 1,664నుంచి 6,225ఓట్లు రాగా.. 17 మంది స్వతంత్రులకు 379నుంచి 1,003, మరో 14మందికి 1,025 నుంచి 1,660ఓట్లు వచ్చాయి. అలాగే మహబూబాబాద్‌ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌లతోపాటు బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ, ఏడీఆర్‌పీ, జీజీపీ, డీఎస్‌పీ, జీడీపీ, ఎస్‌పీ, టీజేపీ, బీపీపీ పార్టీల నుంచి అభ్యర్థులు పోటీ చేశారు. ఇక్కడ 'నోటా'కు 6,591ఓట్లు రాగా.. కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు మినహాయిస్తే.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దుర్గ పాల్వంచకు 10,119ఓట్లు, కోనేటి సుజాత (బీఎస్పీ)కు 8,093 ఓట్లు రాగా.. మిగతా పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు అందరికీ 'నోటా' కంటే తక్కువే వచ్చాయి. 13మందికి 1,125 నుంచి 4,062 ఓట్లు రాగా, చందా లింగయ్య (స్వతంత్ర)కు 5,100, అనిల్‌కుమార్‌ బోడ (స్వతంత్ర)కు 6,431 ఓట్లు వచ్చాయి.



సీఎం రేవంత్‌ను కలిసిన కావ్య

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో కలిసిన వరంగల్‌ ఎంపీగా ఎన్నికైన కడియం కావ్య. చిత్రంలో మంత్రి కొండా సురే ఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజే ందర్‌ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్ర కాశ్‌రెడ్డి, యశస్విని రెడ్డి, కేఆర్‌.నాగరాజు, మేయర్‌ గుండు సుధారాణి, డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు, నాయకులు ఎర్రబెల్లి స్వర్ణ, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, సిరిసిల్ల రాజయ్య, ఝాన్సీ.

- హన్మకొండ

మంత్రి 'తుమ్మల'ను కలిసిన బలరాంనాయక్‌



మంత్రి తుమ్మలను కలిసిన ఎంపీ బలరాంనాయక్‌, ఎమ్మెల్యేలు

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌ రెడ్డిలను బుధవారం సత్తుపల్లిలోని మంత్రి నివాసంలో కలిసిన మహబూబాబాద్‌ ఎంపీగా ఎన్నికైన పోరిక బలరాంనాయక్‌, చిత్రంలో ఎమ్మెల్యేలు మురళీ నాయక్‌, రామచంద్రునాయక్‌, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌ చందర్‌ రెడ్డి, నాయకులు నూకల నరేష్‌ రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

- మహబూబాబాద్‌ రూరల్‌

వ్యవసాయ బావిలో పడి వృద్ధుడి మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండలం దేశాయితండా పంచాయతీ పరిధిలోని సీతతండాకు చెందిన రైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతతండాకు చెందిన రైతు బానోతు గోవిందు(70) వరినారుకు నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మోటారు ఆన్‌ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. సాయంత్రం వరకు గోవిందు ఇంటికి రాలేదని బావి వద్దకు వెళ్లిన మనుమడు రవి చూడగా.. బావిలో శవమై కనిపించాడు. ఎస్సై ముత్యం రాజేందర్‌, కానిస్టేబుల్‌ చారి సిబ్బంది బావి వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. మనుమడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న 'ఎమ్మెల్సీ' కౌంటింగ్‌



కౌంటింగ్‌ కేంద్రంలో కరచాలనం చేస్తున్న కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ అభ్యర్థులు తీన్మార్‌ మల్లన్న, రాకేశ్‌రెడ్డి



బ్యాలెట్‌ పత్రాన్ని చూపుతున్న ఎన్నికల సిబ్బంది

ప్రశాంతంగా 'పట్టభద్రుల' ఎమ్మెల్సీ ఉపఎన్నిక కౌంటింగ్‌ ప్రారంభం

- సాయంత్రం 4 గంటల వరకు సాగిన బండిల్స్‌ కట్టే ప్రక్రియ
- 5 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభం
- నేటి ఉదయం తేలనున్న ఫలితం

నల్లగొండ : వరంగల్‌ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి కౌంటింగ్‌ బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్‌ రూమ్‌లోని బ్యాలెట్‌ బాక్సులను కౌంటింగ్‌ హాల్స్‌కు తీసుకొచ్చారు. నాలుగు హాళ్లలో ఏర్పాటు చేసిన 96 టేబుళ్లపై 25 ఓట్లను ఒక్క బండిల్‌గా కట్టారు. ఈ ప్రక్రియ 4 గంటల వరకు సాగింది. ఆ తర్వాత మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌ గత నెల 27న జరిగింది. మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అందులో కాంగ్రెస్‌ నుంచి తీన్మార్‌ మల్లన్న, బీఆర్‌ఎస్‌ నుంచి రాకేశ్‌రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉంది. ఈ ఎన్నికల్లో మొత్తం 4,63,839 ఓట్లకు గాను 3,36,013 ఓట్లు పోలయ్యాయి.

96 టేబుళ్లపై లెక్కింపు

బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ప్రారంభమైన మొదటి ప్రాధాన్యత కౌంటింగ్‌ ప్రక్రియలో మొదటి రౌండ్‌ ఫలితం రాత్రి 12 గంటలకు వెలువడింది. 96 టేబుళ్లపై టేబులుకు వెయ్యి ఓట్ల చొప్పున ఒక్కో రౌండ్‌లో 96 వేల ఓట్లను లెక్కిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు 4 రౌండ్లలో పూర్తవుతుంది. ఈ ప్రకారం పోలైన 3,36,013 ఓట్లను లెక్కించడానికి 3 రౌండ్లలో టేబుల్‌కు వేయి ఓట్ల చొప్పున, 4వ రౌండ్‌లో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున లెక్కించనున్నారు. 4 రౌండ్లలో మొదటి ప్రాధాన్యత కౌంటింగ్‌ పూర్తవుతుంది. గురువారం ఉదయం వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల ఫలితం వెల్లడికానుంది.

ఓట్ల లెక్కింపు ఇలా..

పోటీ చేసిన 52 మంది అభ్యర్థులకు సంబంధించిన ప్రత్యేక బాక్సులను ప్రతి టేబుల్‌పై ఉంచుతున్నారు. చెల్లని ఓట్లకు సంబంధించి మరో బాక్సు ఉంచారు. ఇలా వెయ్యి ఓట్లలో ఒక్కో బ్యాలెట్‌ పేపర్‌ను తెరిచి ఎవరికి మొదటి ప్రాధాన్యత ఓటు పడిందో.. అక్కడి ఏజెంట్లకు చూపించి ఆ అభ్యర్థి బాక్సులో ఆ ఓటు పెడుతున్నారు. చెల్లని ఓటు వస్తే ఏజెంట్లకు చూపి చెల్లని ఓట్ల బాక్సులో వేస్తున్నారు. ఇలా ఆ టేబుల్‌పై మొదటి ప్రాధాన్యతలో వెయ్యి ఓట్లలో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనేది లెక్క చేయడంతో పాటు చెల్లని ఓట్లు ఎన్ని అనేది లెక్క చేసి చూపుతారు. ఇలా 96 టేబుళ్లపై కౌంటింగ్‌ ప్రక్రియ సాగుతోంది.

మొదటి ప్రాధాన్యతలో గెలవకపోతే..

మొదటి ప్రాధాన్యత కౌంటింగ్‌ పూర్తయిన తర్వాత చెల్లని ఓట్లను తీసివేసి చెల్లిన ఓట్లలో సగానికి ఒక ఓటును కలుపుతూ గెలుపు టార్గెట్‌ నిర్ణయిస్తారు. ఆ టార్గెట్‌ ప్రకారం మొదటి ప్రాధాన్యత కౌంటింగ్‌లో ఏ అభ్యర్థికైనా మెజార్టీ వస్తే అతడిని గెలిచినట్లు ప్రకటిస్తారు. లేదంటే ఎలిమినేషన్‌ పద్ధతిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించనున్నారు.



కౌంటింగ్‌ కేంద్రానికి వస్తున్న నల్లగొండ కలెక్టర్‌, ఎస్పీ



బ్యాలెట్‌ పత్రాలను వేర్వేరు డబ్బాల్లో వేస్తున్న సిబ్బంది

మూగజీవాల పాలిట మృత్యుపాశాలు

- విద్యుత్‌ తీగలు తెగిపడి ఐదు ఎద్దుల మృతి



విద్యుత్‌ తీగ తెగిపడంతో మృతి చెందిన ఎద్దులు

కాటారం(మహదేవపూర్‌): విద్యుత్‌ తీగ మూగజీవాల పాలిట మృత్యుపాశాంగా మారింది. మేతకోసం వెళ్లిన ఎద్దులపై విద్యుత్‌ వైరు తెగిపడటంతో ఐదు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం పెద్దంపేటలో బుధవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గావిడి మల్లయ్య, తడండ్ల లక్ష్మయ్య, ఎర్రయ్య, గౌరవేని కిష్టయ్యకు చెందిన ఎద్దులు రోజులాగే పశుగ్రాసం కోసం గ్రామ శివారులోని చేలలోకి వెళ్లాయి. ఈక్రమంలో పశువులు మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌ తీగ తెగిపడటంతో ఐదు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. వ్యవసాయం జీవనోపాధిగా బతుకుతున్న తమకు ఎద్దులు మృతి చెందడటంతో తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

మాన్‌సింగ్‌తండాలో దుక్కిటెద్దులు..

ములుగు రూరల్‌: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని మాన్‌సింగ్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాన్‌సింగ్‌ తండాకు చెందిన విప్‌సింగ్‌, ఆంగోత్‌ యాకుబ్‌లకు చెందిన రెండు దుక్కిటెద్దులు సమీప పొలంలోకి మేత కోసం వెళ్లాయి. ఈ క్రమంలో దుక్కిటెద్దులు ట్రాన్స్‌పార్మర్‌కు తగిలి విద్యుషాక్‌తో చనిపోయాయి. మృతి చెందిన దుక్కిటెద్దుల విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుదని బాధిత రైతులు తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులు పరిహారం ఇప్పించాలని కోరారు.

'నీట్‌'లో శివానీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హసన్‌పర్తి: ఇటీవల విడుదలైన నీట్‌ ఎంట్రన్స్‌లో శివానీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చగా బుధవారం కళాశాలలో వారిని అభినందించారు. కళాశాలకు చెందిన సీ.హెచ్‌ సాత్విక (611 మార్కులు), ఎస్‌. సాయి ప్రియ(535), వి. భావని(529), ఎస్‌.ప్రదీప్‌ (487),ఈ. కార్తీక్‌ (483), సీ.హెచ్‌. సాద్విక (481), ఎల్‌. అనూష(481), బి.లోకేష్‌ (477), ఎం.ముఖేష్‌ (477) మార్కులు సాధించినట్లు శివానీ విద్యాసంస్థల కరస్పాండెంట్‌ తాళ్లపల్లి స్వామి తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్‌ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్‌, డైరెక్టర్లు రాజు, ఎస్‌. రమేష్‌, మురళీధర్‌, వి. సురేష్‌, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.